క్లుప్తంగా

నేటి నుంచి ఎల్‌టీసీ శిక్షణ తరగతులు

పామూరు: పామూరులోని చెత్త నుంచి సంపద తయారీకేంద్రంవద్ద శుక్రవారం నుంచి ఆరు రోజుల పాటు ఎల్‌టీసీ శిక్షణ తరగతులు జరుగుతాయని ఈఓపీఆర్‌డీ జి.అరవిందారెడ్డి తెలిపారు. శిక్షణకు జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పిఓ, ఎంపీడీఓ హాజరుకానున్నార న్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్లు విధిగా శిక్షణా కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

పొగాకు సరాసరి ధర రూ. 275.96



వేలం నిర్వహిస్తున్న నిర్వాణాధికారి సునీల్‌కుమార్

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ.275.96 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. పెట్లూరు, జగ్గరాజుపాలెం,ఎన్.ఎన్. కండ్రిక గ్రామాలకు చెందిన రైతులు 328 బేళ్లను వేలానికి తీసుకువచ్చారు. అందులో 302 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేయగా వివిధ కారణాలతో 26 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.260 పలికింది. వేలంలో 11 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు.

టంగుటూరు: రైతులు పొగాకు బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా 150 కిలోలీలకు మించకుండా వేలానికి తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన వేలంలో చింతలపాలెం, దావగూడూరు గ్రామాలకు చెందిన రైతులు 27 బేళ్లను తీసుకురాగా మొత్తం బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280 పలికింది. వేలంలో 9 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

పొన్నలూరు: మండలంలోని బోగనంపాడులో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను స్థానిక పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై అనూక్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న జూదరులను అదుపులోకి తీసుకొని వారి దగ్గర నుంచి రూ.9430 నగదును స్వాధీనం చేసుకున్నారు.


వీఆర్‌కు లింగసముద్రం ఎస్సై

లింగసముద్రం: ఎస్సై షేక్ మహమ్మద్ సుభానిని ఎస్పీ ఆదేశాలకు జిల్లా పోలీసు కార్యాలయం వీఆర్‌కు పంపించారు. గురువారం ఎస్సై సుభాని ఇక్కడ నుండి రిలీవై వీఆర్‌కు వెళ్లిపోయారు. ఆయన లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో 8 నెలల పాటు విధులు నిర్వర్తించారు.

గుండెపోటుతో మాజీ జెడ్పీటీసీ మృతి

పామూరు: మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ మోరబోయిన హుస్సేన్‌రావుయాదవ్(60) గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతిచెందారు. ఈసందర్భంగా మోపాడులోని ఆయన నివాసానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కదిరి పార్థసారధి భౌతికకాయానికి నివాళులర్పించి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

దాతల సహకారం అభినందనీయం



విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ

హనుమంతునిపాడు: దాతల దాతృత్వం అభినందనీయమని ఎంఈఓ జి .పెద్దిరాజు అన్నారు. చిన్న ముప్పళ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొటికల పెద్దక్క జయంతి సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. అనంతరం భోజనం ఏర్పాటుచేశారు. సర్పంచ్ కొటికల అంకాలమ్మ, ఎంఈఓలు ఎస్ .రమణయ్య,పెద్దిరాజు, దాతలు కొటికల చిన్నబాదుర్ల,బాలబాదుర్ల, పెద్ద బాదుర్ల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం

కనిగిరిరూరల్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు మే తన లక్ష్యమని విశ్రాంత హెచ్‌ఎం పాపసాని కిచ్చారెడ్డి అన్నారు. పట్టణంలోని రెండు ప్రధాన సెంటర్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతిరోజు వందల మంది ప్రయాణికులకు, పాద చారులకు చలివేంద్రం ద్వారా చల్లటి నీటిని అందిస్తున్న విశ్రాంత హెచ్‌ఎం సేవానిరతిని కొనియాడారు.

కంది రైతు కంట కన్నీరు



కళ్లాల్లో కందులు



నాణ్యత తగ్గి వచ్చిన కందులు

- తగ్గిన దిగుబడులు, ధరలు
- పెరిగిన పెట్టుబడుల భారం..
- దక్కని గిట్టుబాటు ధరలు
- గతేడాది రూ.10నుంచి రూ.12వేలకు కొనుగోలు..
- ఈ ఏడాది రూ.7,550లకు కొనుగోలు
- అన్నదాతకు తప్పని వడ్డీల భారం

కనిగిరిరూరల్: అరుగాలం శ్రమించి పంట పండించిన కంది రైతు కంట కన్నీరు పెడుతున్నాడు. ఈ ఏడాది కంది సాగు చాలా ప్రాంతాల్లో దిగుబడులు బాగా తగ్గాయి. గతంలో దిగుబడులు బాగున్నా..ప్రభుత్వ మద్దతు ధర కూడా అధికంగానే ఇచ్చారు. దీంతో ఎంతో ఆనందంగా ఉన్న రైతుకు ఈ ఏడాది పెట్టుబడులు పెరిగి.. దిగుబడి తగ్గి.. ప్రభుత్వ మద్దతు ధర తగ్గడంతో కంది రైతు బోరుమంటున్నారు.

అధిక విస్తీర్ణంలో సాగు..

కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఆరు మండలాల్లో ఎక్కువగా కంది సాగు చేస్తారు. కనిగిరి ఆరు మండలాల్లో 15,504 హెక్టార్లు కంది సాధారణ విస్తీర్ణం కాగా.. 17,808 హెక్టార్లు కంది సాగు జరిగినట్లు నివేదికలున్నాయి. కనిగిరి ప్రాంతంలో సాగు, తాగు నీటి వనరులు తక్కువగా కావడం. మెట్ట ప్రాంతం అధికంగా ఉండటంతో ఈ ప్రాంతంలోని రైతులు అత్యధికంగా కంది, మినుము, పొగాకు పంటలను సాగు చేస్తారు. అయితే ఈ ఏడాది రైతుకు గడ్డుకాలంగా మారిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. దిగుబడి తగ్గడం.. ఆశించిన ధరలు పలకక పోవడంతో రైతు కన్నీటి ఘోష పెడుతున్నాడు. గత ప్రభుత్వంలో రైతుకు పంట సాగు బడి సమయానికి రైతు భరోసా కింద నగదు సాయం చేసి ఆదుకునేది.. ఈ ప్రభుత్వంలో ఆపరిస్థితి కూడా లేదు. దీంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద వడ్డీలకు తెచ్చి పెట్టుబడులు పెట్టిన పరిస్థితి. దీనికి తోడు గిట్టుబాటు ధరలు లేక పోవడంతో కంది రైతులు మరింత ఊబిలో కూరుకుని పోయే పరిస్థితి నెలకొంది.

పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన ధరలు ..

కంది పంట సాగుకు ఎకరాకు రూ. 25 నుంచి 30 వేలు పెట్టుబడులు పెట్టగా.. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఆధారంగా చూస్తే ప్రతి రైతుకు ఎకరాకు కనీసం రూ.10నుంచి 12 వేల వరకు నష్టం వాటిల్లే పరిస్థితి. దిగుబడి పెరిగిన రైతుకు అంటే ఎకరాలు 4,5 క్వింటాళ్లు వచ్చిన రైతుకు కొంత నష్టం తగ్గినా వాతావరణం మార్పు వల్ల డిసెంబర్‌లో కురిసిన ఎడతెరపి లేని వర్షాల కారణంగా కొందరి పంటకు పూత రాలి దిగుబడి తగ్గింది. అలాంటి రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గతేడాది ప్రభుత్వ మద్దతు ధర కందులు క్వింటాకు రూ.12 వేల వరకు ఇవ్వగా.. ఈ ఏడాది రూ.7,550కి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి తీసుకుంటున్నారు. ఇక ప్రైవేట్ వ్యాపారులైతే రూ.7 వేలకే కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. దీంతో రైతుల ఆశలపై నీళ్లు పడ్డాయి. అరకొరకగా వచ్చిన దిగుబడులకు తోడు నాణ్యత పేరుతో రైతులను కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పెడుతుండటంతో రైతులు కొనుగోలు కేంద్రా వద్దకు వెళ్లేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలిసింది.

కనిగిరి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో కంది సాగు వివరాలు

మండలం	సాధారణ విస్తీర్ణం (హెక్టార్లలో)	సాగు విస్తీర్ణం విస్తీర్ణం (హెక్టార్లలో)
కనిగిరి	6,599	6,965
పామూరు	996	1,569
వెలిగండ్ల	2,632	3,124
హెచ్‌ఎం పాడు	183	330
సీఎస్ పురం	766	608
పీసీపల్లి	4,328	5,212
	15,504	17,808

కందిరైతు పరిస్థితి దయనీయం



ఈ ఏడాది కంది రైతు పరిస్థితి దయనీయంగా ఉంది. పది ఎకరాల్లో కంది సాగు చేశాను.ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా... 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దానికి తోడు ప్రభుత్వ మద్దతు ధర తీవ్రంగా తగ్గించారు. గత ఏడాది క్వింటాకు రూ.12 వేల వరకు ఇవ్వగా.. ఈ ఏడాది రూ.7,550 మాత్రమే ఇస్తున్నారు. వడ్డీలకు తెచ్చి పెట్టుబడులు పెట్టి అల్లాడుతున్నాం.

– పేరం నాగార్జునరెడ్డి, పోలవరం)

కంది రైతుకు తీవ్ర ఇబ్బందులు



మూడు ఎకరాల్లో మినుము వేశాను. అంతా పోయింది. మళ్లీ 5 ఎకరాల్లో కంది వేశాను. ఎకరాకు రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టాను. దిగుబడి చాలా తగ్గి వచ్చింది. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. గతంలో దిగుబడి పెరిగింది, ధర బాగుంది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కంది రైతుకు గిట్టుబాటు ధర లేక పోవడంతో కన్నీరు పెట్టాల్సి పరిస్థితి.

– గంటా వెంటరెడ్డి, హనుమంతునిపాడు

రికార్డులు ఆడిటింగ్‌కు సిద్ధం చేయాలి




ప్రతిభ కనబరిచిన వీఓఏ శేషమ్మకు బహుమతి అందజేస్తున్న ఏపీఎం

కొండపి: గ్రామైక్య సంఘాల, స్వయం సహాయక సంఘాల రికార్డులను ఆడిటింగ్‌కు సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గోపీనాథ్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘ సహాయకులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నందున గ్రామ సంఘాలు, స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీల రికార్డులను పరిశీలించి ఆడిటింగ్ చేస్తామన్నారు. ఉల్లాస్ యోజన కార్యక్రమం ద్వారా వయోజనులకు ఆదివారం నిర్వహించే పరీక్షను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. డీఆర్‌డీఏ వెలుగు శాఖలో వివిధ సబ్జెక్టులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు వీఓఏలు శేషమ్మ, గంగాధర, అన్నపూర్ణలను ప్రత్యేకంగా అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ లీగల్ కో ఆర్డినేటర్ ఎం. శ్రీనివాసరావు, సీసీలు మల్లికార్జున, కృష్ణారెడ్డి, రామానుజులు, గోవిందమ్మ, రవణమ్మ, అకౌంటెంట్ కోటేశ్వరి, వీఓఏలు పాల్గొన్నారు.

బావిలో వ్యర్థాల తొలగింపు



కల్లూరివారిపాలెంలో స్కీం బావిలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం



స్కీం బావిలో వ్యర్థాలను తొలగించిన తరువాత పరిశుభ్రంగా ఉన్న నీళ్లు

- హర్షం వ్యక్తం చేసిన కల్లూరివారిపాలెం గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్..

పొన్నలూరు: మండలంలోని కోటపాడు పంచాయతీ కల్లూరివారిపాలెంలో సుమారుగా 200 కుటుంబాలు ఉన్నాయి. అయితే 2004లో గ్రామస్తులకు నీటి కష్టాలు తొలగించడానికి రూ.లక్షలు వెచ్చించి గ్రామానికి సమీపంలోని పాలేరులో రక్షిత మంచినీటి స్కీమ్ బావిని ఏర్పాటు చేశారు. ఈ స్కీమ్ బావి నుంచి గ్రామంలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో పైపులైన్ ద్వారా నీటిని నిల్వ చేసి కుళాయిలతో నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం బావిలో కొంతమేర నీళ్లు ఉన్నా అవి పూర్తిగా పాచి పట్టి కలుషితమై అపరిశుభ్రంగా ఉన్నాయి. ఈ క్రమంలో స్కీం బావి నీళ్లు తాగడంతో అనారోగ్యానికి గురవుతామని భావించిన గ్రామస్తులు, ద్విచక్ర వాహనాలపై ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కె.అగ్రహారికి సెంటర్‌కు వెళ్లి ప్రైవేట్ వాటర్ ప్లాంట్స్ నుంచి 20 లీటర్ల నీటిని రూ.15 కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. ఈ సమస్యపై సాక్షి దిన పత్రిక లో బుధవారం 'మంచి నీళ్లివ్వండి మహాప్రభో' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు గురువారం పాలేరులోని మంచినీటి స్కీం బావిలో పాచితో పాటు వ్యర్థాలను తొలగించారు. అలాగే నీటిని శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లించారు. దీంతో నీళ్ల సమస్య పరిష్కరించినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు

దశదినకర్మలో పాల్గొన్న ఆదిమూలపు



సోమయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సురేష్

కొండపి: మండలంలోని నేతివారిపాలెం వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు దివి శ్రీనివాసరావు చిన్నాన్న దివి సోమయ్య అనారోగ్యంతో మరణించాడు. గురువారం జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొని సోమయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి సానుభూతి ప్రకటించారు. కార్యక్రమంలో దివి శ్రీనివాసరావు, మండల సీనియర్ నాయకులు బొక్కిసం సుబ్బారావు, మండవ మాలకొండయ్య, చింతల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వసంతరావు, దివి పిచ్చయ్య, శ్రీనివాసరెడ్డి సుధాకర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కనిగిరిరూరల్: లో వోల్టేజీ సమస్యను పరిష్కరించి, ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని ఒకటవ వార్డు సాయి నగర్‌లో 66కిలో వాట్స్ నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ను గురువారం చైర్మన్ గఫార్ ప్రారంభించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పట్టణంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏఈ పవన్‌కుమార్, లైన్‌మన్ రాజశేఖర్, వెంకటయ్య, వికలాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు దూళిపాళ్ల మల్లికార్జునరెడ్డి, సంగరాజు సాయి మనోజ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలి

కనిగిరిరూరల్: స్థానిక ప్రభుత్వ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన టీచర్ రంగారెడ్డిని కఠినంగా శిక్షించాలని ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే బషీరా, ప్రసన్నా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు సమద్, పాండు రంగారావులు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకర్లతో మాట్లాడారు. విద్యార్థినుల పట్ల టీచర్ లైంగిక దాడులకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించిన ఉపాధ్యాయున్ని కఠినంగా శిక్షించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో అధిక ఆదాయం



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ విజయరాణి

సీఎస్‌పురం(పామూరు): ప్రకృతి వ్యవసాయంలో పంటల సాగు చేయడంద్వారా తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చని ఏఓ బి.సంపత్‌కుమార్, కనిగిరి డివిజన్ మాస్టర్ ట్రైనర్ డి.విజయరాణి అన్నారు. మండలంలోని చింతపూడు రైతుసేవా కేంద్రంలో గురువారం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) పథకంలో భాగంగా ఖరీఫ్ 2025 యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా పకృతి వ్యవసాయం సిబ్బంది, వ్యవసాయశాఖ, వెలుగు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాస్టర్‌ట్రైనర్ విజయరాణి, ఏఓ సంపత్‌కుమార్‌లు మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రావాలన్నారు. వెలుగు ఏపీఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి వెలుగు ద్వారా నీటి కుంటలు, షేడ్‌నెట్‌లద్వారా కూరగాయల పెంపకం గురించి వివరించారు. చింతపూడు, రాజుపాలెం ప్రకృతివ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆదిమూలపు సురేష్

కొండపి: మండలంలోని నేతివారిపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకుడు దివి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే దివి శంకరయ్య, దివి సోమయ్య, దివి చెంచయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సురేష్ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలోమాజీ పీడీసీసీబీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, గ్రామ నాయకుడు దివి శ్రీనివాసరావు, మండల సీనియర్ నాయకులు బొక్కిసం సుబ్బారావు, మండవ మాలకొండయ్య, ప్రముఖ పారిశ్రామికవేత్త చింతల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వీర వసంతరావు, శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ కొండయ్య, కోటపాటి చంద్ర పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: లైంగిక వేధింపులు, అసభ్యకర చర్యల నేరాల నుంచి బాలికలకు రక్షణ కల్పించే పోక్సో యాక్ట్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక కృష్ణ చైతన్య డిగ్రీ కళాశాలలో గురువారం న్యాయ సేవాధికార సంస్థ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ న్యాయం ప్రతి ఒక్కరి హక్కుగా తెలిపారు. చట్టాలపై అందరూ అవగాహన కల్గి ఉండాలని తెలిపారు. న్యాయవాది పాశం పిచ్చయ్య, కళాశాల డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, అధ్యాపకులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు కిషోర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల తనిఖీ

హనుమంతునిపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఎంఇఓ జి.పెద్దిరాజు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజర్, రోలు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నిర్వహణ, మెనూ, పరిశీలించారు. కూరలు తిని రుచి చూశారు. స్టోర్ రూం, పరిసరాలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బాలికల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలు చేశారు. మెనూ అమలు చేస్తున్నారా లేదా విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ టి.అంజమ్మ, టీచర్లు ఉన్నారు.

అంతా మా ఇష్టం..!

- కాంట్రాక్టు పనులకు పంచాయతీ వాహనాల వినియోగం
- ప్రభుత్వం మాది మా ఇష్టమంటున్న తెలుగు తమ్ముళ్లు
- మురుగును నివాస ప్రాంతాల్లో పోయడంపై విమర్శలు

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వంలో పచ్చ తమ్ముళ్లు బరితెగిస్తున్నారు. ప్రభుత్వ సొమ్ము తమ ఆస్తిలా భావించి వారి అవసరాలకు వినియోగిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..ఎన్ఆర్‌జీఎస్, రూర్బన్ నిధులు సుమారు రూ.50 లక్షలతో మినీ బైపాస్‌రోడ్డులోని సెయింట్ జోన్స్ స్కూల్ ఎదురుగా ఉన్న మురుగుకాలువ ఆధునీకరణ పనులు పచ్చనేత చేపట్టారు. అయితే ఈ కాలువ ఆధునీకరణకు పంచాయతీ ట్రాక్టర్‌ను వినియోగించుకోవాలని పంచాయతీ ట్రాక్టర్, డ్రైవర్‌ను పంపాలని హుకుం జారీ చేసి పనులు ప్రారంభించారు. అయితే ఈ తీసిన మట్టిని ఊరికి దూరంగా నిర్మానుష్యంగా ఉండే ప్రాంతంలో ఎవరికి ఇబ్బంది లేని విధంగా పోయాల్సి ఉండగా ఆ మురుగును కందుకూరు రోడ్డు లో నివాస ప్రాంతంలో ఎస్సీ బాలుర వసతి గృహం సమీపంలో పోశారు. దీంతో ఆ ప్రాంతం దుర్గంధభరితంగా మారింది. ఒక పక్క స్వర్ణాంధ్రప్రదేశ్-స్వచ్ఛాంధ్రప్రదేశ్ అంటూ ఊకదంపులు ప్రసంగాలిస్తూ మరో పక్క నివాస ప్రాంతంలో మురుగు ఎలా పోస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే సదరు నేతలు ఒక రోజు ఆగితే దుర్గంధం ఆగిపోతుందని సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పఠాన్ రియాజ్ మాట్లాడుతూ కందుకూరు రోడ్డులో ఇళ్ల మధ్య మురుగు వేయడం దారుణమన్నారు. ఇప్పటికే పంచాయతీలో దోమల దండయాత్ర తో ప్రజలు అల్లాడుతున్నారని, ఇలాంటి చర్యలతో దోమలు మరింత విజృంభిస్తే ప్రజలు రోగాలబారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు పనులకు పంచాయతీ ట్రాక్టర్‌ను, సిబ్బందిని ఏ విధంగా ఉపయోగిస్తారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.



పంచాయతీ ట్రాక్టర్‌తో తరలిస్తున్న మురుగు



కందుకూరు రోడ్డులో ఇళ్లకు సమీపంలో రోడ్డు పక్కన మురుగునిల్వ చేసిన దృశ్యం

వెంకట కొండయ్య మృతి పార్టీకి తీరని లోటు



వెంకటకొండయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సీఎస్‌పురం(పామూరు): సీపీఐ మండల సమితి సభ్యుడు, జిల్లా సమితి సభ్యుడు ఎం వెంకటకొండయ్య(65) మృతి సీపీఐ పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్‌మౌలాలి, సీఎస్ పురం మండల కార్యదర్శి ఎస్‌కేవై. పెదమస్తాన్, పామూరుమండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. మండలంలోని నల్లమడుగుల గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు యం.వెంకటకొండయ్య గురువారం తన ఇంట్లో ఆకస్మాత్తుగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల సీపీఐ నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుని కుటుంసభ్యులను పరామర్శించారు. .

శాస్త్రీయ భద్రత లేని వర్గీకరణ అంగీకరించం



చలో తిరుపతి వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

టంగుటూరు: శాస్త్రీయ భద్రత లేని వర్గీకరణ అంగీకరించమని రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్‌బాబు అన్నారు. టంగుటూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న తిరుపతిలో జరిగే మాలల మహాగర్జన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, స్వర్ణ వెంకయ్య, విజయకుమార్, వెంకట్ , దళిత రైట్స్ ఫెడరేషన్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు టి. క్రాంతికుమార్, చంద్రబాబు, రాజేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి వాలీబాల్ పోటీలు

ఉలవపాడు: రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 27 గ్రామాల్లో ఈ నెల 22, 23 తేదీల్లో వాలీబాల్ పోటీలు జరుగుతాయని మెరైన్ సీఐ జి.శివన్నారాయణ తెలిపారు. రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ (మెరైన్) పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో మత్స్యకారుల సహకారంతో రామాయపట్నంలో పోటీలు జరుతాయన్నారు. మెరైన్ డీఐజీ గోపీనాథ్, అడిషనల్ ఎస్పీ జీబీఆర్ మధుసూదన్‌రావు పర్యవేక్షణలో పోటీలు జరుగుతాయన్నారు. 27 గ్రామాల పరిధిలోని టీంలు పాల్గొనవచ్చని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.15,000, రెండో బహుమతిగా రూ.12000, మూడో బహుమతిగా రూ.8000, నాల్గవ బహుమతిగా రూ.5000 అందచేస్తామని పేర్కొన్నారు.